అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 24 జులై 2023
1

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు. ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని పలు కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చలేదని పేదలకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీర ఆత్మా రామ్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, జిల్లా దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ఉపాధ్యక్షుడు జయరాజ్ పాల్గొన్నారు.

వాగులో పడి పశువుల కాపరి మృతి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని దేవునిగూడెం అనుబంధ గ్రామం నాయకపుగుడా శివారులో ఉన్న వాగులో పడి పశువుల కాపరి అరే ఎల్లయ్య(48) అనే వ్యక్తి మృతి చెందాడు. నాయకప్పు గుడా గ్రామానికి చెందిన ఎల్లయ్య ఎప్పటిలాగానే శనివారం పశువులను మేపడానికి వెళ్లాడని గ్రామస్తులు తెలిపారు. అయితే భారీ వర్షాలు నేపథ్యంలో అక్కడి వాగులో వరద ఉధృతి ఎక్కువగా ఉంది. వాగును దాటే క్రమంలో ఎల్లయ్య ప్రమాదవశాత్తు ఆ వాగులో పడి మృతి చెందాడని స్థానికులు తెలిపారు.

పేదలకు అండగా బాల్క ఫౌండేషన్

• మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజ్‌కుమార్



నవతెలంగాణ-భీమారం

పేదలకు అండగా బాల్క పౌండేషన్ చేయూతను అందిస్తోందని చెన్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భుక్య రాజ్‌కుమార్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ధీన స్థితిని ఎదుర్కొంటున్న పలువురు నిరుపేద కుటుంబాలకు బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన దుర్గం సాంబయ్య మృతి చెందడంతో దశదిశ కర్మ కార్యక్రమానికి 50 కేజీల బియ్యం అందించినట్లు తెలిపారు. అదేవిధంగా గత ఏడాది ఒకే కుటుంబానికి చెందిన పెద్దల మాంతయ్య, పోశంలు చెరువులో పడి మృతి చెందారు. దీంతో పోశం భార్య ఆనారోగ్యం భారిన పడి పక్షవాతం వచ్చి ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉందని తెలిసి బియ్యం అందించినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన భైరినేని చంద్రక్క, గత కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయూతనందిచామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దుర్గం మల్లేష్, బీఆర్ఎస్ గ్రామ ప్రెసిడెంట్ మైదం సాయిబాబా, గట్టయ్య సోషల్ మీడియా, పళ్ళ మహేష్, ఆకుల రవి, సోదరి మల్లేష్, రైతు బందు అధ్యక్షుడు గోదారి ప్రభాకర్, భీమారం ఎక్స్ ఎంపీటీసీ జల్లంపల్లి భూలక్ష్మి-తిరుపతి పాల్గొన్నారు.

మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారమే



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఖానాపూర్ నియోజకవర్గ టీఆర్ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని కలమడుగు గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ముందుగా ఆ గ్రామస్తులు మహిళలు గ్రామ పొలిమేర నుంచి మంగళ హారతులతో డప్పు వాయిద్యాలతో జాన్సన్ నాయక్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వాటిని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను, ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్ర ప్రజలు మరోసారి కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో కలమడుగు గ్రామ ఉపసర్పంచ్ రాజు, జాన్సన్ యువసేన సభ్యులు ఫజల్ ఖాన్, కేపే నరసింహులు, జక్కుల సురేష్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుసెత్పల్లీ సత్యం పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

నవతెలంగాణ-చింతలమానేపల్లి

గ్రామాలలో నేరాలను నియంత్రించేందుకే కార్డెన్ సర్చ్ నిర్వహిస్తున్నామని కౌటాల సీఐ సాధిక్ పాషా అన్నారు. మండలంలోని చిత్తం గ్రామంలో ఆదివారం ఉదయం పోలీస్ సిబ్బందితో కాటన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంట్లో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. గ్రామస్తులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో నూతన వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల్లో గుడుంబా, మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో ప్రతి ఒక్కరు ప్రశాంతంగా ఉండాలని, ఎలాంటి గొడవలు అల్లర్లకు పాల్పడద్దని సూచించారు. అలాగే యువత చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వ్యసనాలకు అలవాటై జీవితాలు నాశనం చేసుకోవద్దని అన్నారు. వాహనదారులు, వాహనాలకు సరియైన ధ్రువ పత్రాలు ఉంచుకోవడంతోపాటు, వాహనాలు నడిపే వ్యక్తులు లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడ్డా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం మండంలో వర్షాలకు పొంగి పొర్లుతున్న వాగులను పరిశీలించి స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చింతలమానెపల్లి, కౌటాల ఎస్సైలు విజయ్ కుమార్, ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

రోడ్డు సౌకర్యం లేక నిండు గర్భిణుల అవస్థలు



నవతెలంగాణ-వేమనపల్లి

రోడ్డు సౌకర్యం లేక నిండు గర్భిణీల అవస్థలు పడ్డ ఘటన మండలంలో చోటుచేసుకుంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీల్వాయి అటవి ప్రాంతంలో కల్వర్టు శనివారం తేగిపోగా ఆర్ అండ్ బీ అధికారులు వచ్చి తాత్కాలిక కల్వర్టు నిర్మాణం కోసం పరిశీలించి రెండు రోజులలో నిర్మాణం చేపడతామని తెలిపారు. అది పూర్తి అయ్యేవరకు ద్విచక్రవాహనాలు తప్ప వేరే వాహనాలు వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. శనివారం నాగారం గ్రామానికి చెందిన నిండు గర్భిణీ అవస్థలు పడుతు వెళ్లగా, ఆదివారం కొత్తపల్లి గ్రామానికి చెందిన మరో గర్భిణీ దుర్గం లావణ్య పురిటి నొప్పులతో బాధపడుతూ అంబులెన్స్ సహాయంతో నీల్వాయి అటవి కల్వర్ట్ వద్దకు చేరుకోగా అక్కడి నుండి తీవ్ర ఇబ్బందులు పడుతూ కాలి నడకనన అంబులెన్స్ సిబ్బంది కల్వర్ట్ దాటించారు. అవతలి వైపు ఇంకో అంబులెన్స్ సహాయంతో గర్భిణీని చెన్నూరు ఆస్పత్రికి తరలించారు.

వరద కష్టం...తీరని నష్టం...!



ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని పంట పోలాలను ముంచెత్తిన వరద

- జిల్లాలో 25వేల ఎకరాల్లో పంట నష్టం
- తీవ్రంగా దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు
- నేలవాలిన విద్యుత్ స్తంభాలు..రూ.25లక్షలు నష్టం
- ప్రాథమికంగా అంచనా వేసిన అధికార యంత్రాంగం

ఆదిలాబాద్ జిల్లాలో సృష్టించిన వర్ష భీభత్సం తీరని నష్టాన్ని మిగిల్చింది. నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి తీర ప్రాంతాలను ముంచెత్తడంతో పంట పొలాలు వర్షార్పణమయ్యాయి. నాలుగు రోజులుగా నీటిలో ఉండటంతో పత్తి, సోయా మొలకల కాండం ఎర్రబారి ఎదుగుదల లోపించే పరిస్థితి కనిపిస్తోంది. అనేక చోట్ల పత్తి మొక్కలు నీటిలోనే ఉండటంతో తీవ్ర నష్టం వాటిల్లింది. వీటితో పాటు పలు చోట్ల రహదారులు దెబ్బతినగా..మరికొన్ని చోట్ల కల్వర్టులు పాక్షికంగా ధ్వంసమయ్యాయి.దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోపక్క రోజుల తరబడి నీటిలోనే ఉండటంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కిందపడిపోయాయి. తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దున పెన్‌గంగా నది ఉగ్రరూపం దాల్చడంతో జాతీయ రహదారిపై ఒకరోజు పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం వరద ఉధృతి కాస్త తగ్గుముఖం పట్టడంతో రాకపోకలను పునరుద్ధరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎప్పటికప్పుడు కింది స్థాయి అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తూ అప్రమత్తం చేశారు.

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం ఉమ్మడి జిల్లాను అతలాకుతలం చేసింది. వర్ష భీభత్సానికి జనజీవనం స్తంభించిపోయింది. నదులు, వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చడంతో అనేక గ్రామాలకు రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి. అనేక మారుమూల పల్లెలకు రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. శనివారం మధ్యాహ్నం నుంచి వర్షం ఉపశమనం కలిగించడంతో అధికార యంత్రాంగం నష్టాన్ని అంచనా వేసింది. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి వర్షం సృష్టించిన నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేసింది. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న పంటలు దెబ్బతినడంతో అన్నదాతల బాధలు వర్ణనాతీతంగా మారాయి. నదులు, వాగుల పరివాహక ప్రాంతాల్లోని పొలాలు ఇప్పటికీ నీటిలోనే మగ్గిపోతున్నాయి. చెరువులను తలపించేలా మారిన పంట పొలాలను రక్షించుకోవడం అన్నదాతలకు కష్టతరంగా మారింది. కనీసం పొలాలకు వెళ్లి నీటిని బయటకు వదిలేయడానికి కూడా వీలులేకుండా పోవడం వారిని మరింత ఆందోళనకు గురిచేసింది.

నష్టం అంచనా వేసిన అధికారులు

ఆదిలాబాద్ జిల్లాలో కురిసిన వర్షానికి జరిగిన నష్టాన్ని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 25వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. ఇదే మాదిరి మిగితా నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ పంట నష్టం జరిగినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. మరోపక్క ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. జామిని- పెన్‌గంగా, బోథ్ నుంచి నిగ్వి వరకు, ఇచ్చోడ నుంచి సిరికొండకు వెళ్లే దారితో పాటు హస్నాపూర్ నుంచి ఎల్లాపూర్ వెళ్లే రహదారి తీవ్రంగా దెబ్బతింది. మరో 17చోట్ల కల్వర్టులు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలో ఆర్‌అండ్‌బీకి రూ.1.20లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ కిందటేడాది సంభవించిన వరదలతో ఇదే శాఖకు రూ.9కోట్ల వరకు నష్టం వాటిల్లినప్పటికీ.. ప్రభుత్వం కేవలం రోడ్ల మరమ్మతుల కోసం రూ.కోటి మంజూరుచేసి చేతులు దులుపుకొన్నట్లు తెలుస్తోంది. ఇక విద్యుత్‌శాఖకు వరదలు తీవ్ర నష్టానికి గురిచేశాయి. 89చోట్ల విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు కిందపడిపోవడంతో ఈ శాఖకు రూ.26.79లక్షలు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇదే మాదిరి మిగితా మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ రోడ్లు, కల్వర్టులు, విద్యుత్ స్తంభాలు దెబ్బతినడంతో రూ.కోట్లలో నష్టం జరిగినట్లు తెలుస్తోంది. రూపొందించిన నష్టం అంచనాను ప్రభుత్వానికి పంపించనున్నట్లు వ్యవసాయ, విద్యుత్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి తెరిపిచ్చిన వర్షం.. మళ్లీ కురిస్తే మరింత నష్టం సంభవించే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



బోథ్ మండలంలోని దెబ్బతిన్న నిగ్వి రోడ్డు



కౌటాల మండలంలో పంట పొలాలు జలమయం

పద్మశాలీల హక్కుల సాధకు నిరంతరం కృషి

• సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పద్మశాలిల హక్కుల రక్షణకు నిరంతరం కృషి చేస్తానని, సంఘం బలోపేతానికి అందరి సహాయ సహకారాలతో ముందుకు సాగుతానని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవనంలో నూతనంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్ని మండలాల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారుల నిర్ణయం మేరకు నిర్ణయించిన జిల్లా ఎన్నికలలో పాల్గొన్న తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా గడదాసు మల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. పద్మశాలీల చైతన్యం కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను శాలువాలు, పూలమాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కమిటీ నిర్వాహకులు హనుమాన్ల శ్రీకాంత్, వడ్నాల వెంకన్న, గాజర్ల శైలేందర్, దాసరి తిరుపతి, సంఘం నాయకులు మారిన వెంకటేశ్వర్లు, చిప్ప సురేష్, నల్ల కనకయ్య, గుండా శంకర్, చిందం చంద్రయ్య, కోమటిపల్లి లింగయ్య, కొంగ సత్యనారాయణ, రాపల్లి సదానందం, అల్లే శ్రీకాంత్, బొద్దున చందు, జంజరాల సంజీవ్, భోగ సత్యనారాయణ, దుబ్బ సత్యనారాయణ, రాంపల్లి విజయ, ఇరుకుల్లా మంగ, చెన్నూరి సునీత, గడదాసు రోజా, రుచిత ,జంజరాల శోభ, వంగరి ప్రవీణ్, హనుమన్ల శంకర్ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసేంతవరకు పోరాటం ఆగదు

• టీఎస్ సీపీఎస్ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ



నవతెలంగాణ-హాజీపూర్

ఉద్యోగ ఉపాధ్యాయుల కాంట్రి బ్యుటరీ పెన్షన్ రద్దు చేసేంతవరకు పోరాటం ఆగదని తెలంగాణ రాష్ట్ర కాంట్రి బ్యుటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ ఢిల్లీ, పంజాబ్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాలలో అక్కడి ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేశాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు కోసం ఆగస్ట్ 12న హైదరాబాద్‌లో జరిగే దర్నాలో ఉద్యోగ, ఉపాద్యాయులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు మేడి శంకర్, ప్రధాన కార్యదర్శి రాజేందర్, జిల్లా ట్రేసా అధ్యక్షుడు ఇత్యాల కిషన్, పీఆర్‌టీయూ ఇన్నారెడ్డి, కలెక్టరేట్ ఏఓ కాసబోయిన సురేష్, బెల్లంపల్లి తహసీల్దార్ మధుసూధన్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెంగాణ-సిర్పూర్(టి)

గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పెనుగంగ నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై దికొండ రమేష్ సూచించారు. ఆదివారం మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు రాష్ట్రల మధ్య ప్రవహించే పెన్‌గంగ ప్రవాహాన్ని పరిశీలించారు. పొడుషా, వెంకటరావుపేట్, జక్కాపూర్, సిర్పూర్ గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెన్‌గంగా బ్రిడ్జ్‌పై నుండి ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో తాత్కాలికంగా రాకపోకలను నిలిపివేశారు. ఈ రెండు మార్గాలలో ఎలాంటి ప్రయాణాలు కొనసాగించవద్దని, అలాగే జాలర్లు చేపల వేటకు వెళ్లవద్దని సమీపంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఎలాంటి ప్రమాదాలు గురికావద్దని సూచించారు. నీటి ప్రవాహం వైపు వెల్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సహాయక చర్యలకైనా అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

మణిపూర్ నింధితులను కఠినంగా శిక్షించాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు
- మానవహక్కుల రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు
- మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా నిసనలు

నవతెలంగాణ-జైనూర్

మణిపూర్‌లో మహిళలపై జరిగిన అగాయిత్యానికి కారకులైన నింధితులను కఠినంగా శిక్షించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, మానవహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలోని కుమురంభీం చౌరస్తా వద్ద ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు, మైనార్టీ సంఘం వివిధ పార్టీల నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో ఆదివాసీ మహిళ హత్య జరగడం కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యమని మండిపడ్డారు. కేంద్రంతో పాటు మణిపూర్‌లో కూడా బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కూడా ఆ ప్రాంతంలో గిరిజన మహిళలను దారుణంగా లైగికదాడి, హత్య చేయడం సిగ్గుచేటన్నారు. కేంద్రంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్ కనీసం మణిపూర్‌లో జరిగిన గిరిజన మహిళ హత్యపై నేటి వరకు కూడా నింధితులను శిక్షించకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే నింధితులకు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం మహిళలకు రక్షణ ఇవ్వకుండా ఇలాంటి హత్యాఖాండ జరగడానికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రధానమంత్రి, హోంశాఖ మంత్రి ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నింధితులకు ఉరిశిక్ష విధించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు ఆత్రం సుగుణక్క, హజ్ కమిటీ రాష్ట్ర సభ్యుడు ఇంతియాజ్‌లాల, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మడావి భీంరావు, నేతకాని రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రవీందర్, ఎంపీటీసీ బీటీనూర్ నాయకులు అజ్జులాల, సర్పంచ్‌లు కనక ప్రతిభ వెంకటేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కనక వెంకటేశ్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుడిమెత విశ్వనాథ్, ఎస్ఎన్‌జె వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ జావీద్ అలీ, దళిత నాయకుడు కామ్లె అన్నారావు, మైనార్టీ నాయకులు నజర్, షేక్ హైదర్, ఉర్దూ మీడియం ఎస్ఎంసీ చైర్మన్ షేక్ మౌళా, బీఆర్ఎస్ నాయకులు మెస్రం అంబాజీ, పెందూర్ లచ్చు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ : మణిపూర్‌లో జరిగిన మహిళల నగ్న ఊరేగింపు ఘటనకు కారకులను కఠినంగా శిక్షించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక రాజీవ్‌చౌక్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్, టీపీఆర్‌టీయు, ఎటీఎ, టీయూటీఎఫ్ సంఘాల నాయకులు వైద్య శాంతికుమారి, శ్యాంసుందర్, విస్తారు, తలండి లక్ష్మణ్, నాగేష్, కటకం మధూకర్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో గత 80 రోజులుగా మారణహోమం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని అన్నారు. శాంతిని నెలకొల్పడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రధాని ఇప్పటికైనా మౌనం వీడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, మహిపాల్, నరేష్, దామోదర్, నారాయణ, ప్రీతి, వర్ష, సునీత, ప్రసన్న, నిఖిత, గోపి, చిలుకూరి రవీందర్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లకు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని యూఎస్‌పీసీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఉపాధ్యాయ ఉద్యోగ విద్యార్థి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం టీఎస్‌యూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావు, టీఎస్‌టీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ కిరణ్ కుమార్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సంజయ్ కుమార్‌లు మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం మణిపూర్ రాష్ట్రంలో జరిగిన మహిళలపై అత్యాచారం, వారిని వివస్త్రలను చేసి బహిరంగంగా ఊరేగించడం, అక్కడి ఆదివాసి తెగలపై మూకలు దాడులు నిర్వహించి ఆందోళనలు, అశాంతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నప్పటికీ అక్కడి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మౌనంగా ఉండటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హేమంత్ షిండే, రమేష్, ఉషన్న, సుభాష్, నాగోరావు, మనుకుమార్, శంకర్, దయారాం, గోర్ సింగ్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, సీఐటీయూ నాయకుడు రాజేందర్, ఎస్ఎఫ్ఐ నాయకుడు టికనంద్ పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో...



ఆసిఫాబాద్‌లో...

సీఆర్ఆర్ అభిమాన సంఘం అధ్యక్షులుగా దుర్గం శేఖర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల స్వర్గస్తులైన మాజీ మంత్రి రామచంద్రారెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ, ప్రజాహితం కోసం పని చేస్తామని సీఆర్ఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు దుర్గం శేఖర్ తెలిపారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో పలువురు సీనియర్ నాయకులు ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి సీఆర్ఆర్ అభిమాన సంఘాన్ని ఏర్పాటు చేయగా సంఘం అధ్యక్షులుగా దుర్గం శేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ద్వారా చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాల గురించి చర్చించారు.

సవారి బంగ్లాను ప్రారంభించిన మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని నిరటివాడలో రూ.14లక్షలతో, చించర్‌వాడలో రూ.5లక్షలతో నిర్మించిన సవారి బంగ్లాను ఆదివారం మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ మత సామరస్యాన్ని కాపాడుతూ కలిసికట్టుగా పండుగలు నిర్వహించుకుంటూ స్ఫూర్తిగా నిలవడం జరుగుతుందని అన్నారు. బంగ్లా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి బంగ్లాను ప్రారంభించారు. గ్రామాలలో, పట్టణాలలో పీరీల పండుగ ఎంతో వైభవోపేతంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సవారి ఉత్సవాలు వర్షాకాలంలో రావడంతో ఉత్సవాలు చేసుకోలేని పరిస్థితిలో ఉండేదని ప్రతి సవారి బంగ్లాల వద్ద షెడ్లను ఏర్పాటు చేసి, ఒకే చోట అందరూ కలిసి పండుగ చేసుకునేలా షెడ్ల నిర్మాణాలను కూడా పూర్తిచేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజరెడ్డి, కౌన్సిలర్ అశోక్ స్వామి, కుమ్ర రాజు, కొండ గణేష్, కస్తాల ప్రేమల, సాయి, బషీర్, సుధాకర్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి అర్థిక సాయం



నవతెలంగాణ-బోథ్

మండలంలోని గుర్రాల తండా గ్రామానికి చెందిన అజాడే మల్హారి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆదివారం తన సభ్యులకు తెలంగాణ లభాన ఎంప్లాయిస్ సభ్యులు రూ.27,480 ఆర్థిక సాయం అందజేశారు. అలాగే వారు కుటుంబానికి మరిన్ని సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు చౌహన్ నానక్ సింగ్, ఏఎస్ఐ, చౌహన్ ఈశ్వర్ సింగ్, విశ్రాంతి ఉపాధ్యాయుడు, సోలంకి ప్రకాష్ సింగ్, ఎక్సైజ్ కానిస్టేబుల్, చౌహన్ సంజయ్‌సింగ్, సోలంకి శ్రీనివాస్, సోలంకి భీమ్ సింగ్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎస్సైకి సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

బదిలీపై మండల కేంద్రానికి నూతనంగా వచ్చిన ఎస్సై ధనుశ్రీని ఆదివారం మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో ఆ సంఘ నాయకులు కాడే శ్రీనివాస్, రావుల నర్సింగ్, భూత దేవన్న, సచిన్, రవి, దీపక్, పురుషోత్తం, రాకేష్, దేవన్న, నారాయణ, పలువురు సంక్షేమ సంఘం నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని పుణ్యానాయక్ తండా జైత్‌రామ్, కౌట(బి) గ్రామానికి చెందిన వన్నేపాగ లక్ష్మణ్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ ఆదివారం వారి కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు తిరుమల్‌గౌడ్, డాక్టర్ స్వామి, పండురంగ్, ఈశ్వర్ ముండే, శేఖర్ పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును

విరమించుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

మండల కేంద్రంలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేయాలనే ఆలోచనని విరమించుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య అన్నారు. ఆదివారం ప్రజాసంఘాల కార్యాలయంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన కుమార్ అధ్యక్షతన కొనసాగింది. ఈ సందర్భంగా మాట్లాడారు. దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ప్రజల నివాసాల మధ్యల పరిశ్రమ ఏర్పాటు చేస్తే ప్రజల అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుందని అన్నారు. ఇప్పటికే మహబూబ్‌నగర్ జిల్లాలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేయడం ద్వారా చుట్టుపక్కల అనేక గ్రామాల్లో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా, ఏకపక్షంగా పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రయత్నించడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే పరిశ్రమకు వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని అన్నారు.

మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటనలను నివారించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం..

మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక సంఘటనలను నివారించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. కుకీ తెగకు చెందిన ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించిన, సామూహిక లైంగిక దాడి చేసి, హత్య చేసిన కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 54 శాతానికి పైగా ఉన్న మైతి కులస్తులకు, కుకి, నాగ గిరిజన తెగల మధ్య చిచ్చు పెట్టి బీజేపీ రాజకీయ లబ్ది పొందడం కోసం ప్రయత్నిస్తుందని విమర్శించారు. గిరిజన సంపదను మైతీలకు కట్టబెట్టేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న చర్యల్లో భాగంగానే మణిపూర్‌లో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. మణిపూర్ ప్రజలకు సంఘీభావంగా ప్రతి ఒక్కరూ నిలువాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ నెల 25న జరిగే సంఘీభావ కార్యక్రమాల్లో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు.

కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొమ్మెన సురేష్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ అరవింద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వైఖరికి నిరసనగా రాజీనామాలు



నవతెలంగాణ-ముథోల్

మండలంలోని బీఆర్ఎస్ నాయకులు ఆదివారం తమ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. మండలంలోని తరోడ గ్రామంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మీ నర్సగౌడ్ తన నివాసంలో తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తాము గత కొన్ని ఏండ్లుగా ఎమ్మెల్యే విఠల్ రెడ్డి వెంట ఉండి పార్టీ పటిష్టత, గెలుపుకు సహకరించిన తమకు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆరోపించారు. రాజకీయంగా తమను పట్టించుకోకపోవడంతో పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తాము ఏ పార్టీలో చేరేది ఆగస్టు 5 తేదిలోపు ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ అనూష సాయి బాబా, తరోడ సర్పంచ్ శ్వేత రవికిరణ్ గౌడ్, బొరిగాం మాజీ సర్పంచ్ లక్ష్మణ్, నాయకులు దశరథ్, నర్సారెడ్డి, భోజన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు.. పలువురికి గాయాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పశువులు రోడ్లపై సంచరిస్తుండటంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పశువులు రోడ్డుపై బైటాయించడంతో పాటు రహదారిపై నుంచి సంచరిస్తూ పొట్లాడుకుంటుండటంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాగే ఆదివారం మధ్యాహ్నం తిర్పెల్లి జాతీయ రహదారిపై రెండు ఎడ్లు పోట్లాడుకుంటూ పక్క నుంచి ద్విచక్ర వాహనాన్ని తాకటంతో కింద పడిపోయారు. దంపతులతో పాటు వారితో ఉన్న పిల్లలకు గాయాలయ్యాయి.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ముదోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి



నవతెలంగాణ-ముథోల్

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బ్రహ్మణ్‌గావ్‌కు చెందిన 30 మంది లబ్ధిదారులకు, బాసర మండలంలోని ఓని గ్రామంలోని 36 లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని అన్నారు. ముఖ్యంగా రైతులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్‌తో పాటు పెట్టుబడి సాయం అందిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, మండల రైతుబంధు అధ్యక్షుడు రాంరెడ్డి, తహసీల్దార్‌లు తుకారాం, సంతోష్, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖాలీద్, ఎంపీటీసీ సరళ శ్రీనివాస్‌గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బోథ్ అస్తిత్వాన్ని దెబ్బతీస్తే ఊరుకునేది లేదు

● ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్



నవతెలంగాణ-బోథ్

బోథ్ అస్తిత్వాన్ని దెబ్బతీస్తే ఊరుకునేది లేదని ఎంపీ సోయం బాపురావు అన్నారు. ఆదివారం రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షలకు మద్దతుగా ఎంపీ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ సాధించేంతవరకు విశ్రమించేది లేదని అన్నారు. అలాగే బోథ్ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని అన్నారు. బోథ్ నుంచి తరలిపోయిన కార్యాలయాలు వెనక్కి రావాలని డిమాండ్ చేశారు. పొచ్చర గ్రామానికి చెందిన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, యువజన సంఘాల నాయకులు రిలే దీక్ష శిబిరంలో నిరాహార దీక్షకు కూర్చున్నారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యు డివిజన్ సాదన సమితి సభ్యులు పాల్గొన్నారు.

గిరిజనేతరుల వైపు మాట్లాడటం సిగ్గు చేటు



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య గిరిజనేతరులకు అనుకూలంగా మాట్లాడటం సిగ్గు చేటుని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామారావు అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులకు సైతం హక్కులు కల్పించాలని వ్యాఖ్యానించడం విడ్డురమని అన్నారు. షెడ్యూల్ ప్రాంతాల్లో హక్కులు, చట్టాలు ఎవరికి దక్కుతాయో తెలియద అని అన్నారు. స్వార్థ రాజకీయాలు కోసం ఇలాంటి ప్రకటనలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఆదీవాసులందరు గుమ్మడి నర్సయ్యకి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీంరావ్, జగన్నాథ్ రావు ఉన్నారు.

కుల మతాలకతీతంగా పీరీల పండుగ

● డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి



నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

కులమతాలకతీతంగా పీరీల పండుగను నిర్వహించుకోవడం జరుగుతుందని డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పొచ్చెర గ్రామంలో రూ.13లక్షల నిధులతో సవారి బంగ్లా షెడ్, మాల సంక్షేమ సంఘం భవనం ప్రారంభం చేయడం జరిగిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి గంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ కుమ్ర విజయలక్ష్మిరాజు, ఎంపీపీ గంధ్రత్ రమేష్, మాజీ ఎంపీపీ సెవ్వలక్ష్మి జగదీష్, గ్రామ ఉపసర్పంచ్ జి రామన్న, బీఆర్ఎస్ నాయకులు గంగాధర్, అల్లూరి రమేష్‌రెడ్డి, గ్రామ యూత్ సభ్యులు నిలేష్‌రెడ్డి, వేల్పుల రవి, నరేష్, చింటూ గ్రామస్తులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని ఖానాపూర్ నియోజక వర్గం

● టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-సిరికొండ

మారుమూల ఏజెన్సీ ప్రాంతాలు ఉన్న ఖానాపూర్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోవడం లేదని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండాపూర్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో, ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడిందని అన్నారు. దీంతో ఆదివారం బ్రిడ్జిని పరిశీలించడానికి వెడ్మ బొజ్జు పటేల్‌తో పాటు ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ విడివిడిగా వచ్చి కొండాపూర్ బ్రిడ్జిని, నష్టపోయిన పంటలను పరిశీలించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బోజ్జు పటేల్ మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం వల్ల నియోజకవర్గ అభివృద్ధికి నోచుకోవడం లేదని, అభివృద్ధి పనులలో ఎమ్మెల్యే రేఖా నాయక్ కమిషన్లు తీసుకోవడం మూలంగా నాణ్యతా ప్రమాణాలతో కూడిన పనులు జరగడంలేదని అన్నారు. గ్రామాలకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమని అన్నారు. పాలకవర్గాలు అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం మానుకోవాలని అన్నారు. ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ మాట్లాడుతూ చిక్మన్ వాగుపై ఉన్న బ్రిడ్జ్ నిర్మాణం పనులు కమిషన్లు సర్దుబాటు కాక ఆగిపోవడంతో వర్షాలు పడిన ప్రతిసారి తాత్కాలిక అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయి మండల ప్రజలు నరకం చూస్తున్నారని అన్నారు. తక్షణమే ఆదిలాబాద్ జిల్లాకి వరద సాయం కింద రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే నష్టపోయిన పంటలకు నష్ట పరిహారం అందేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, నాయకులు ప్రవీణ్, కేశవ్, కళ్యాణ్ రాథోడ్, నగేష్, సుధాకర్, మాణిక్‌రావు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం



నవతెలంగాణ-ఉట్నూర్

ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచిన నేపథ్యంలో ఆదివారం మండలంలోని లాల్ టెక్డి కళాశాలలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ మాట్లాడుతూ గురుకుల హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనం వసతులను అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మానవీయకోణంలో మరోసారి చార్జీల పెంపుపై నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని అన్నారు. గత ప్రభుత్వాలు ఏనాడు విద్యార్థులను పట్టించుకోలేదన్నారు. విద్యార్థులు అడగకుండానే డైట్ చార్జీలు విద్యార్థులకు ఇస్తూ, ప్రతి ఏటా సగటున ఒక విద్యార్థి మీద వేల రూపాయలు ఖర్చు చేయడమే కాకుండా, మెస్ చార్జీల పెంచడం పై హర్షం వ్యక్తం చేశారు. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఆపన్న హస్తమై, వారి సంక్షేమమునకు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షులు తన్నీరు సతీష్, నాయకులు, శ్యామ్ రాథోడ్, రవి చందర్, సుశీల్, స్వామి ఉన్నారు.

ఆవుకు అంత్యక్రియలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని వార్డు నెంబర్ 6లో ఆదివారం ఓ ఆవు అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాలనీ వాసులు గోమాత సేవా ఫౌండేషన్‌కు సమాచారం అందించారు. ఫౌండేషన్ సభ్యులు అక్కడ చేరుకొని ఆవుకు హిందూ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. స్పందించిన ఫౌండేషన్ సభ్యులకు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు సురేష్, జగన్, హేమష్య, సాయి, రాకేష్, పవన్, రాజశేఖర్ ఉన్నారు.

ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కల పరిశీలన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను ఆదివారం మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ ప్రజా అభీష్టాన్ని గౌరవిస్తూ వారికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. పట్టణంలో బ్యూటిఫికేషన్‌లో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించామని అన్నారు. కొద్దిపాటి వర్షాలకే వినాయక చౌక్ నుంచి ఎన్టీఆర్ చౌక్ వరకు రోడ్లు బురదమయంతో ప్రయాణికులు ఇబ్బంది పడేవారని అన్నారు. అలాగే రోడ్లు విస్తీర్ణ చేపట్టి, కుమురం భీమ్ చౌక్, వినాయక చౌక్, నేతాజీ చౌక్, అంబేద్కర్ చౌక్‌లను సుందరీకరణగా తీర్చిదిద్ది. సెంట్రల్ లైటింగ్‌తో పాటు ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను ఏర్పాటు చేసుకున్నామని అన్నారు.

కండ్ల ముందు జరుగుతున్న అభివృద్ధిపై ప్రతిపక్షాలు రాజకీయంగా విమర్శలు చేయడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండ గణేష్, డీఈ యూనీస్ పాల్గొన్నారు.

దివ్యశ్రీ పౌండేషన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్‌లకు లైసెన్స్‌లు

● దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ప్రవీణ్ నాయక్



నవతెలంగాణ-నార్నూర్

లైసెన్స్ లేని ఆటో డ్రైవర్‌లకు దివ్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా లైసెన్స్‌లు అందజేస్తామని దివ్యశ్రీ పౌండేషన్ చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీలో ఆయన మాట్లాడారు. చాలా మంది ఆటో డ్రైవర్లు ఆర్థికంగా ఇబ్బందులు ఉండి లైసెన్స్‌లు పొందలేక, ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లకు తమ పౌండేషన్ ద్వారా లైసెన్స్‌కు అయ్యే డబ్బులు అందజేసి లైసెన్స్‌లు అందజేస్తామని అన్నారు. ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని అన్నారు. ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సహాయం కోసం ఆటో ఉండి లైసెన్స్ లేనివారు లైసెన్స్ కొరకు సంబంధించిన ధ్రువ పత్రాలను ఫౌండేషన్ చైర్మెన్‌ను సంప్రదించాలని అన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 24 జులై 2023

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

నవతెలంగాణ-హాజీపూర్



మంచిర్యాల మున్సిపల్ పరిధిలో రూ.కోటి ఏడు లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజి పనులకు ఆదివారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు భూమి పూజ చేశారు. హాజీపూర్ మండలంలోని టీకానపల్లిలో రూ.20 లక్షలతో నిర్మాణం చేయనున్న గ్రామ పంచాయతీ భవనానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, టీకానపల్లి సర్పంచ్ రాంటెంకి రాజేశ్వరి పాల్గొన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనం ప్రారంభం

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని కన్నాల గ్రామపంచాయతీలో డివిజన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్, బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ జక్కుల శ్వేత, లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ సుదర్శన్, రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచాల రత్నాకర్ అసోసియేషన్ సభ్యులు కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు, ప్రశాంత్ పాల్గొన్నారు.

మాలిలకు ఎస్టీ హోదా కల్పించేలా కృషి చేయాలి

- మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మాలి కులస్తులకు ఎస్టీ హోదా కల్పించేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాని, పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టేందుకు కృషి చేయాలని మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు కోరారు. శనివారం హైదరాబాదులో బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. శ్యాంరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని మాలి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా త్వరలో నిర్వహించే పార్లమెంట్ సమావేశాల్లో చర్చించి, బిల్లు ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బిల్లు ఆమోదించడానికి సహకరిస్తానని, మాలి కులస్తులకు బీజేపీ ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటుందని ఈటెల రాజేందర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెండుగురే శ్యాం రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అదే నాందేవ్, కుమురంభీం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌత్రే గోపాల్, జిల్లా కోశాధికారి లెండుగురే గోపి, లెండుగురే మధు పాల్గొన్నారు.

ఒర్రెలో కొట్టుకుపోయిన వ్యక్తి కోసం కొనసాగుతున్న గాలింపు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బోర్దా గ్రామానికి చెందిన అంజన్న శనివారం ఉదయం ప్రమాదవశాత్తు ఒర్రెలో పడి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. శనివారం నుంచి ఆదివారం వరకు కూడా స్థానికులు, ఇతరులు ఒర్రె వెంట గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ అంజన్న ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. యదావిధిగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

బురదమయమైన రోడ్డు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని తమేశా గ్రామానికి వెళ్లే రహదారి మొత్తం బురదమయం కావడంతో కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. కనీస అవసరాలకు బయటకు వెళ్లాలన్న అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గోడు వెళ్లబోసుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేసి మా కష్టాలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీనియర్ సిటిజన్ మృతి విచారకరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్


దహెగాం మండలం కొంచవెల్లి గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్ కొమురవెల్లి వెంకటయ్య(75) మృతి విచారకరమని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాజకీయాలు వర్సెస్ ఉపాధ్యాయులు

- రాజకీయపోరులో బలవుతున్న వైనం
- ఉపాధ్యాయురాలిపై విచారణ, మరో ఇద్దరు సస్పెన్షన్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇక్కడ ప్రతిపక్షాలు ప్రభుత్వ ఆధీనంలో నడిచే ఏ కార్యాలయానికి వెళ్లవద్దు, అక్కడి సమస్యలు తెలుసుకోవద్దు. ఒకవేళ వెళ్లినా అక్కడి అధికారులు, సిబ్బందితో మాట్లాడవద్దు. ఒకవేళ తప్పిజారి ఏ అధికారి అయినా, సిబ్బంది అయినా ప్రతిపక్ష నేతతో మాట్లాడారా ఇక అంతే సంగతులు. ఆ అధికారి లేదా సిబ్బందిపై వేటు పడక తప్పదు. ఇదీ సిర్పూరు నియోజకవర్గంలో పరిస్థితి. ప్రస్తుతం నియోజకవర్గంలోని రాజకీయపోరుకు ఉపాధ్యాయులు బలవతుండడం ఇపుడు చర్చనీయాంశంగా మారింది. గత వారం రోజులుగా చింతలమానెపల్లి మండలంలోని పాఠశాలల్లో జరుగుతున్న పరిణామాలు పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.



PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER(FAC), K.B.ASIFABAD.
Present: P. Ashok, M.Sc., M.Ed.

Rc.No.86/885/2023-3 Dt:20-07-2023

Sub: Public Services - Lapses are noticed against Smt.R.Saraswathi, SGT, MPUPS Dimda, Chinthanamanepally (M) discharging the legitimate duties - placed under suspension - in the Public interest - Orders - Issued.

Ref: - 1. Representation of villagers through Whats App villagers dt.15.07.2023.
2. Video clippings and images.

-oOo-

Whereas it has been brought to the notice of the undersigned who is competent authority i.e., the District Educational Officer K.B.Asifabad that the following grave lapses are noticed against Smt.R.Saraswathi, SGT, MPUPS Dimda, Chinthanamanepally (M) on par with other staff in the school on 15.07.2023 vide reference 1st and 2nd read above.

1. Found unauthorized absent to the school duties on 15.07.2023 and 18.07.2023 without getting prior permission from the concerned authority due to which the school found completely in a closed condition as a result the attended students are playing in front of the school under the supervision of attended MDM agency.

2. Without getting any exemption as per Govt.Memo.No.3342/19/TA/2005 read with GO.Ms.No. 20 F& B Dt.08.02.2001 he is daily operating from other than school head quarter to school habitually without staying in the working place even though claiming ABB.HRA.

3. Against TS civil services (conduct) Rule 1964 and Rule 15 & 16 appeared and given her voice in electronic media.

Now, therefore, in exercise of the powers conferred by sub-rule (1) of Rule 8 of APCS (CCA) Rules 1991, the appointing authority hereby places the said Smt.R.Saraswathi, SGT, MPUPS Dimda, Chinthanamanepally (M) under suspension from the date of communication of this order and shall continue to be under suspension until the conclusion of the disciplinary proceedings/ termination of all proceedings.

It is further ordered that, during the period of suspension Smt.R.Saraswathi, SGT, MPUPS Dimda, Chinthanamanepally (M) shall not leave the Headquarters without obtaining prior permission from the undersigned. The individual shall be paid Subsistence Allowance equivalent to the leave salary/half pay leave. The D.A. and other compensatory allowances shall be paid along with subsistence allowance. The quantum of subsistence allowance will be reviewed and revised in terms of FR-53 (1) after 3 months. Pending review, he shall continue to draw the subsistence allowance now sanctioned.

Therefore the School Complex Head Master, ZPSS Gudem, Mdl. Chinthanamanepally is requested to serve these orders to the incumbent duly obtaining an acknowledgement from the incumbent and the same shall be sent to the under signed and take further necessary action in the matter.

Receipt of these proceedings should be acknowledged.

Sd/-P.Ashok
District Educational Officer (FAC),
Kumuram Bheem Asifabad.

To
Sri. Smt.R.Saraswathi, SGT, MPUPS Dimda, Chinthanamanepally (M) (Through School Complex HM, ZPSS Gudem)
Copy to the School Complex Head Master, ZPSS Gudem, Chinthalamanepally for information and necessary action.
Copy submitted to the Mandal Educational Officer Chinthalamanepally, for kind information.
Copy submitted to the District collector K.B.Asifabad, for kind information.
Copy to the file.
// t.c.f.b.o //
SUPERINTENDENT

దిందా పాఠశాల ఉపాధ్యాయురాలి సస్పెన్షన్ కాపీ

ఇటీవల రాజకీయాల్లోకి వచ్చిన కొత్త నేత ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు నిర్ణయించి, విస్తృతంగా పర్యటిస్తున్నారు. వారం రోజుల క్రితం చింతలమానెపల్లి మండలంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని ఆయన అకస్మికంగా సందర్శించి, అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారపార్టీ ప్రజాప్రతినిధికి మింగుడుపడలేదు. ఇంకేముంది తన అధికారంతో ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువచ్చాడు. స్పెషల్ అధికారిని తొలగించాలని ఒత్తిడి తీసుకురాగా, సెక్టోరియల్ అధికారిచే విచారణ జరిపించారు. విచారణలో ఆ ప్రతిపక్ష నేత స్పెషల్ అధికారి ప్రమేయం లేకుండానే విద్యాలయానికి వచ్చారని తేలింది. కాని ఈ ప్రజాప్రతినిధిని సంతృప్తి పరిచేందుకు ఎస్‌ఓకు షోకాజ్ నోటీసు జారీ చేసేందుకు నిర్ణయించినట్లు తెలిసింది.

ఇంకో ఘటనలో ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం విస్మయానికి గురి చేస్తోంది. చింతలమానెపల్లి మండలం దిందా ఎంపీయూపీఎస్‌లో పని చేసే ఇద్దరు ఉపాధ్యాయులు ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యారు. దీనికి కారణమేంటో పరిశీలించగా.. ఈ ఉపాధ్యాయులు తమ వద్దకు వచ్చిన ప్రతిపక్ష నేతకు సమస్యలు చెప్పుకోవడమే. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు దిందా వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. నాలుగు రోజుల క్రితం ఆ ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లేందుకు దిందా వాగు వద్దకు వచ్చి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దానిని దాటలేక అక్కడే ఆగిపోయారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన నియోజకవర్గ ప్రతిపక్ష నేత వారిని కలిసి సమస్య అడిగి తెలుసుకున్నారు. ఏళ్ల తరబడి తాము ఈ సమస్యను ఎదుర్కొంటున్నామని వారు ఆయనకు వివరించి చెప్పడం పెద్ద తప్పుగా మారింది. వారు మాట్లాడే వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. తన వైఫల్యాన్ని ఉపాధ్యాయులు ఎత్తి చూపిస్తున్నారని భావించిన ఆ అధికారపార్టీ ప్రజాప్రతినిధి మళ్లీ తన అధికారాన్ని ప్రదర్శించి ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చాడు. ఇంకేముంది.. ఇద్దరు ఉపాధ్యాయులు సస్పెన్షన్‌కు గురయ్యారు. స్థానికంగా ఉండాల్సిన ఉపాధ్యాయులు ఉండకపోవడం, సమాచారం లేకుండానే రెండు రోజులు గైర్హాజరు కావడం, టీఎస్ సివిల్ సర్వీసెస్ రూల్ 1964ను అతిక్రమించి ఎలక్ట్రానిక్ మీడియాకు వాయిస్ ఇచ్చినందుకు గాను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. దిందా పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు స్థానికంగా ఉండని విషయం అధికారులకు ఈ సమయంలోనే గుర్తు రావడం ఇక్కడ గమనార్హం. గతంలో కాగజ్‌నగర్‌లోని ఒక రేషన్ దుకాణాన్ని ప్రతిపక్ష నేత సందర్శిస్తే ఆ డీలర్‌ను కూడా అధికారపార్టీ నేతలు ముప్పుతిప్పలు పెట్టినట్లు తెలిసింది. తన అధికారాన్ని అడ్డుగా పెట్టుకొని ప్రభుత్వ అధికారులు, సిబ్బందిపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

పాఠశాల మూతపడడంతో సస్పెన్షన్

- డీఈఓ

ఉపాధ్యాయుల గైర్హాజరుతో పాఠశాల మూతపడింది. అందుకే ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశాం. కస్తూర్బా ఎస్‌ఓపై విచారణ జరుగుతోంది. ఇంకా చర్యలు తీసుకోలేదు. అధికార పార్టీ ఒత్తిడి మేరకు చర్యలు తీసుకోవడం అనేది అవాస్తవం.

ఉపాధ్యాయుల సస్పెన్షన్ ఎత్తివేయాలి

- బహుజన సమాజ్ పార్టీ

చింతలమానెపల్లి మండలంలోని దిందా పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్ ఎత్తివేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అర్షద్‌హుస్సేన్, మాజీ జడ్పీ చైర్మన్ సిడం గణపతి డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానికంగా ఉండడం లేదని ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని, కాని జిల్లాలోని అన్ని మండలాలలో కూడా డీఈఓ తనిఖీ చేసి స్థానికంగా ఉండని ప్రతీ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తారా అని వారు ప్రశ్నించారు. కొన్ని మండలాలలో మంచిర్యాల జిల్లా నుండి కూడా ఉపాధ్యాయులు రాకపోకలు సాగిస్తున్నారని, ఇది డీఈఓ కంటికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అధికారులు స్వతంత్ర్యంగా వ్యవహరించాలే కాని అధికారపార్టీ ఎమ్మెల్యేకు తొత్తులుగా వ్యవహరించవద్దని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు సోయం చిన్నయ్య, పిల్లల తిరుపతి, ముక్తార్, ఎల్కరి రమేష్, గౌతం పాల్గొన్నారు.

ప్రమాదకరం నాటుపడవ ప్రయాణం

నవతెలంగాణ-కౌటాల



నదులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో నాటుపడవ ప్రయాణం ప్రమాదకరమని, జాలర్లు నాటుపడవలో చేపల వేటకు వెళ్లడం సరికాదని తహసీల్దార్ సాయన్న, సీఐ సాదిక్‌పాషా ఆదివారం తుమ్మిడిహేటి ప్రాణహిత నదిని పరిశీలించారు. ఈ సందర్భంగా నది పరివాహక గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తూ గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని, తుమ్మిడిహేటి ప్రాణహిత నది వరద ఉధృతి రోజురోజుకు పెరుగుతోందని, నది పరివాహక గ్రామాల ప్రజలు ఎవరు నాటుపడవలో చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. ప్రయాణ సమయాల్లో రోడ్లు, వంతెనలు తెగిపోయి రాకపోకలు ఆటంకాలు ఎదరైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున పాఠశాలలకు సెలవులు ప్రకటించారని, చిన్నారులు చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్నచిన్న వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. పురాతన ఇండ్లలో నివాసముంటున్న వారు వర్షాల కారణంగా ఇండ్లు దెబ్బతినే అవకాశముందని, అలాంటి వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలోని పంచాయతీ, పాఠశాల భవనాల్లో వర్షాలు తగ్గే వరకు ఉండాలని, విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని, సమస్యలుంటే వీఆర్‌ఏల దృష్టికి తీసుకొస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకుడు లహంచ్ పటేల్, సంతోష్ ఉన్నారు.

మణిపూర్ ప్రజలకు రక్షణ కల్పించాలి

- రాష్ట్ర ముఖ్యమంత్రిని తక్షణమే బర్తరఫ్ చేయాలి



నవతెలంగాణ-హాజీపూర్

మణిపూర్ రాష్ట్ర ప్రజలకు రక్షణ కల్పించడంలో విఫలమయిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేసి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి ఆ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు రక్షణ కల్పించాలని భారత్ బచావ్ మంచిర్యాల జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం మంచిర్యాలలో నిర్వహించిన ఆ కమిటీ సమావేశంలో నాయకులు పాల్గొని ప్రసంగించారు. దేశ సరిహద్దు రాష్ట్రమైన మణిపూర్‌లో వివిధ వర్గాల ప్రజల మధ్య గొడవలు చెలరేగి 80 రోజులుగా కొనసాగుతున్నా నరేంద్ర మోడీ సర్కారు బాధ్యతారహితంగా వ్యవహరించడం సిగ్గుచేటని వారు పేర్కొన్నారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి గద్దెనెక్కిన కేంద్ర సర్కారు ప్రజలకు కనీస రక్షణ ఇవ్వకపోవడాన్ని నేడు దేశ ప్రజలందరూ నిలదీస్తున్నారని పేర్కొన్నారు. ముగ్గురు స్త్రీలను నగ్నంగా ఊరేగించి సామూహికంగా లైగిక దాడి చేయడం భరతమాతకు తల వంపులేనని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు సైతం తప్పనిసరై రంగంలోకి దిగి నరేంద్ర మోడీ సర్కారును మందలించాల్సి వచ్చిందని తెలిపారు. మణిపూర్‌లోని ఆదివాసులకు రాజ్యాంగ కల్పించిన హక్కులకి భంగం కలుగకుండా చూడాల్సిన బాధ్యత పాలకులదేనని వారు పేర్కొన్నారు. వేల సంవత్సరాల వివక్షకు గురైన ఆదివాసుల హక్కులను కాలరాయాలని చూడడాన్ని సభ్య సమాజం హర్షించదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ బచావ్ జిల్లా చైర్మన్ కునుకుంట్ల మల్లయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వడ్డేపల్లి మనోహర్, జిల్లా కమిటీ నాయకులు రంగు రాజేశం, సంగం లక్ష్మణ్, ఇబ్రహీం, సుంక లక్ష్మణ్, కళ్లెపల్లి సంజీవ్, రాసపల్లి రాజు, శేఖర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

నవతెలంగాణ-రెబ్బెన

మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వర్షాన్ని కూడా లెక్కచేయకుండా గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నారు. ఆదివారం 18వ రోజు సమ్మెలో భాగంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఓదెలు సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపారు. అదేవిదంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్, దేవాజీ, ప్రకాష్, శ్రీనివాస్, నర్సయ్య, రామయ్య, బుచ్చయ్య, శంకర్, సునీల్, రాజమ్మ, గొల్లమ్మ పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగుతుందని జీపీ కార్మిక సంఘం మండల నాయకులు కట్టీరాం తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికులకు 51 జీఓను సవరించి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీఓ నెంబర్ 60 ప్రకారం ప్రతి కార్మికుడికి రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగభద్రత, రూ.10 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

కాసిపేట : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల గ్రామ పంచాయితీ కార్మికులు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. ఆదివారం 18వ రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పటించుకోడం లేదని, గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచి, వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలి గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : డిమాండ్ల పరిష్కారానికి గత 18 రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 17 రోజులకు పంచాయతీ కార్మికుల సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టింపు లేని తనంగా వ్యవహరిస్తుందని అన్నారు. కార్మికుల సమ్మెతో ఎక్కడికక్కడ చెత్త పేరుకు పోయిందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఓదేలు, జిల్లా కార్యదర్శి రాజేందర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ పాల్గొన్నారు.



రెబ్బెన



కాసిపేట :



ఆసిఫాబాద్ :

ఎమ్మెల్యేను కలిసిన పద్మశాలి సంఘం నాయకులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇటీవల నూతనంగా ఎన్నికైన పద్మశాలి సంఘం జిల్లా కార్యవర్గం ఆదివారం సిర్పూరు ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిసింది. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చెన్నూరి అశోక్, ప్రధాన కార్యదర్శి మోర సంపత్‌లను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యేను కూడా సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సేవా సంఘం నాయకులు దాసరి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్, గౌరవాధ్యక్షులు గడదాసు నారాయణ, ఉపాధ్యక్షులు పడాల రాజయ్య, వంగరి రవికుమార్, సదానందం పాల్గొన్నారు.

గౌరవాధ్యక్షుని నియామకం

సంఘం జిల్లా గౌరవాధ్యక్షులుగా కాగజ్‌నగర్‌కు చెందిన గుల్లపల్లి నాగేశ్వర్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఆయన నియామకం ఈ రోజు నుండే అమలులో ఉంటుందని తెలిపారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
www.navatelangana.com
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 24 జులై 2023

వంతెనను పరిశీలించిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-సిరికొండ

కురుస్తున్న భారీ వర్షాలతో కొట్టుకుపోయిన కొండాపూర్ వంతెన అప్రోచ్ రోడ్డు, అలాగే కొత్తగా నిర్మిస్తున్న వంతెన పనులను ఆదివారం నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ పరిశీలించారు. అనంతరం వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వంతెన అప్రోచ్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందని పలువురు ఆయనకు విన్నవించారు. నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల నాయకులు పెంటన్న, రంజాన్, ప్రభాకర్, కృష్ణయ్య, తిరుమల్‌గౌడ్ పాల్గొన్నారు.



పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : ఎంపీ

నవతెలంగాణ-బోథ్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎంపీ సోయం బాపురావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ వద్ద పంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మెకు మద్దతు ఎంపీ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే బీజేపీ పార్టీ ఎప్పుడు మద్దతు ఉంటుందని అన్నారు. అనంతరం మండలంలోని మర్లపల్లి గ్రామాన్ని సందర్శించి, భారీ వర్షంతో ఇంట్లో వరదనీరు చేరిన బాధితుడికి టార్పాలిన్ కవర్లు అందజేశారు. ఎంపీ వెంట నాయకులు జీవీ రమణ, కట్ట భూమేష్, బి.రాజు, రాజేందర్ పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



నవతెలంగాణ-హాజీపూర్

కేంద్రంలో, రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. ఆదివారం మంచిర్యాల పట్టణంలోని ఆయన నివాసంలో హమాలీ వాడ, ఎన్టీఆర్ కాలనీకి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ దేశం కాంగ్రెస్ వైపు చూస్తుందని అన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్‌ల అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే అసమర్థత, అనాలోచిత నిర్ణయాలతో రాబోవు రోజుల్లో కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు జరగనున్నట్లు తెలిపారు. సర్వేలు ఆయనకు వ్యతిరేకంగా రావడంతోనే బీఆర్ఎస్ నియోజవర్గ ముఖ్య నేతలు తన సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

తాండూర్ : బెల్లంపల్లి మండలం పెర్కపల్లికి చెందిన ముత్తే కొమురయ్య మాజీ వార్డు సభ్యుడు చింతం నారాయణ, కుదిరే తిరుపతి, సాయిల్లా మల్లేష్, అకిరెడ్డి శంకర్, రామగోని లక్ష్మణ్ గౌడ్, కాందూరి కొమురయ్య ఆదివారం బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరినట్లు బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నాతరీ స్వామి తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్ రావు సమక్షంలో చేరినట్టు వివరించారు.

రామకృష్ణాపూర్ : పట్టణ పరిధిలోని పులిమడుగు గ్రామంలో మంచిర్యాల డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో చెన్నూరు నియోజకవర్గ పీసీసీ సభ్యుడు నూకల రమేష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, ఆధ్వర్యంలో ఆదివారం పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మండల అధ్యక్షుడు బానోతు నిలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గండే రామచందర్, టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ఎండీ ముజాహిద్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు బాధవత్ రమేష్ నాయక్, డీసీసీ ఉపాధ్యక్షులు పుళ్ళురి లక్ష్మణ్, రామకష్ణాపూర్ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మరాఠీ శంకర్, జిల్లా నాయకులు జనార్ధన్, బాణయ్య, సుగునకర్‌రావు పాల్గొన్నారు.

నిర్మల్ : కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయంగా పాతరేయాలని కాంగ్రెస్ నాయకులు శ్రీహరిరావు అన్నారు. ఆదివారం తన నివాసంలో పలువురికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మామడ మండలంలోని మైనార్టీ యువకులు బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరినట్టు తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలోని బుధవార్ పేట్, హరిజనవాడకు చెందిన బండి ఆనంద్ తన అనుచరులతో, సోన్ మండలం గ్రామం సిద్దులకుంట నుంచి గడ్డం చిన్న నర్సారెడ్డి, అల్లూరి నర్సారెడ్డి, పోశెట్టి, జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది సిరాజ్ బీఎస్పీ పార్టీకి రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడితే దళితుడిని సీఎం చేస్తానని నమ్మబలికి, సీఎం కేసీఆర్ దగా చేశారని మండిపడ్డారు. దళితబంధు పేరిట మరో సారి దళితులను మోసం చేస్తున్నారని అన్నారు. అర్హులకు కాకుండా కేవలం వారి ఎమ్మెల్యేలు చెప్పిన వారికి మాత్రమే దళితబంధు ఇవ్వాలని, ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని అన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే వచ్చే ఎన్నికల్లో ఇందిరమ్మ రాజ్యం రావాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దుండగులను కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-నిర్మల్

మణిపూర్ ఘటన దుండగులను కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో మాట్లాడారు. ప్రపంచంలో భారత దేశం సంస్కృతి, ఆచారాలను చూసి, ప్రపంచ దేశాలు ఎంతో గౌరవం ఇస్తున్నాయని అన్నారు. మణిపూర్ ఘటనతో భారత దేశ పరువు ప్రతిష్టలు, దెబ్బతీసేలా చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని అన్నారు. దుండగులను వెంటనే ఫాస్ట్‌ట్రాక్ కోర్ట్ విచారణ జరిపి శిక్షించాలని అన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కోకన్వీనర్లు సిరికొండ రమేష్, జింక లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

వరద ఉధృతి నిలిచిన వాహనాలు

నవతెలంగాణ-జైనథ్

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దును గల పెన్‌గంగా నది నీటి ప్రవాహం పెరగడంతో 44వ జాతీయ రహదారిపైన పిప్పిర్‌వాడ టోల్ ప్లాజా వద్ద రాత్రి 8 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు ఎక్కడికక్కడే వాహనాలను అధికారులు నిలిపివేశారు. ఉదయం నీటి ప్రవాహం తగ్గడంతో వాహనాలను యధావిధిగా రాకపోకలకు అనుమతించారు.

కోడిగుడ్ల వ్యాన్ బోల్తా

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని బోయపల్లి సమీపంలోని రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం కోడిగుడ్ల వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కోడిగుడ్ల పగిలిపోయాయి. అక్కడి ప్రాంతంలో దుర్గంధం వెదజల్లింది. సిద్దిపేట నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్లే క్రమంలో వ్యాన్ బోల్తా పడింది. బోయపల్లి బోర్డ్ క్రాస్ వద్ద రెండు బైకులు ఎదురుగా రావడంతో వారిని తప్పించబోయి అదుపుతప్పి వ్యాన్ బోల్తా పడినట్టు స్థానికులు తెలిపారు. డ్రైవర్ చాకచక్యంగా రెండు ప్రాణాలను కాపాడే క్రమంలో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్ ఆసీఫ్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజుర సత్యం అన్నారు. ఆదివారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఆయన సందర్శించారు. ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండానే లబ్ధిదారులకు తాళాలు అప్పజెప్పారని మండిపడ్డారు. కనీస వసతులు లేకుండా ఎలా కేటాయిస్తారని, కేటాయింపులకు ఎందుకు ఇంత తొందర పడాల్సివచ్చిందని అన్నారు. అసలైన లబ్ధిదారులకే కేటాయించాలని, లేని పక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేకూరెలా కృషి చేస్తామని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సందర్శించిన వారిలో షబ్బీర్ పాషా, చెట్టి శ్యామ్ మోహన్ రావులు ఉన్నారు.

వృద్ధుల పట్ల శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-బోథ్

వృద్ధాశ్రమంలోని వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధవహించాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనిలోని వృద్ధాశ్రమంలో ఎలుక రాజు స్వప్న, వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకొని వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులతో సమయాన్ని కేటాయించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో కుటుంబీకులు పాల్గొన్నారు.

రోడ్డును బాగుచేసుకున్న గ్రామస్తులు



నవతెలంగాణ-సిరికొండ

ఎవరో వచ్చి ఏదో చేస్తారని, చూడకుండా సొంతంగా గ్రామస్తులంతా ఏకమై లక్కంపూర్ గ్రామస్తులు రొడ్డును బాగు చేసుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు మొత్తం కోతకు గురైంది. గ్రామానికి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండటంతో గ్రామస్తులంతా కలిసి రోడ్డును బాగు చేసుకున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నామని అన్నారు. పాలకులకు, అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని అన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

జలపాతాల వద్ద జాగ్రత్తగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో ఉన్న జలపాతాల వద్ద ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. ఆదివారం తిర్యాని మండలంలోని చింతలమాదరం జలపాతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలపాతాల వద్దకు వచ్చే సందర్శకులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అవసరమైన ఏర్పాట్లు చేయాలని నీటి ప్రవాహ వేగాన్ని బట్టి సందర్శకులను అనుమతించాలని సూచించారు. జలపాతాల వద్ద లోతు ప్రాంతాలకు వెళ్లకుండా సూచికలు ఏర్పాటు చేయాలని అన్నారు.



బీఆర్ఎస్ పార్టీకి ప్రజలే అండ

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

నవతెలంగాణ-తలమడుగు

బీఆర్ఎస్ పార్టీకి ప్రజలే అండగా నిలిచి ముందుకు నడిపిస్తున్నారని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం చర్లపల్లి గ్రామంలో సవారి బంగ్లా ప్రారంభించగా సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో హామీ ఇవ్వని పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. దేశంలో ఎక్కడ లేని పథకాలను కేవలం తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్నారని అన్నారు. కుల, మత తారతామ్యం లేకుండా రైతులకు రైతుబంధు, ఇన్సూరెన్స్, పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ ఇలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కేసీఆర్ కిట్టు, దళితబంధు, దళితబస్తీ, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. అనంతరం గ్రామస్తులు వివిధ అభివృద్ధి పనులు అడుగగా రూ.8లక్షలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. వెంటేనే పనులను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలు, ఉప సర్పంచ్ హేమన్ రావు, సీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వనమాల, మండల ఉపాధ్యక్షురాలు దివ్య, మార్కెట్ డైరెక్టర్ లలిత బాయి, ఎంపీటీసీ చంటి, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, మహాజన్ నాగారావు, ఝరి సర్పంచ్ రఘు, ఆ పార్టీ నాయకులు రామ్‌రెడ్డి, లింగారెడ్డి, మల్కు పటేల్, జనక్, శాస్త్రి, ప్రకాష్, లక్ష్మణ్, గజానంద్,, నర్సింలు, ఆశన్న యాదవ్, పొచ్చన్న కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



అంబరాన్నంటిన పూర్వ విద్యార్థుల సమ్మేళన సంబరాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1979-80 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 44 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేడుకలు ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో అంబరాన్ని అంటేలా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాల కార్యక్రమాలతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసేలా కార్యక్రమాలు ఆద్యంతం ఉత్తేజం నింపాయి. ఈ సందర్భంగా గురువులు హరిచంద్ర రావు, జగదీశ్వరయ్య, కిష్టయ్య, సత్యమూర్తులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా తమ విద్యార్థులను మరోసారి కలుసుకునే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని అన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండటమే గురువులకు గొప్ప గౌరవమని తెలిపారు. తమ ద్వారా విద్య నేర్చుకుని ఉన్నత స్థానాలు సంపాదించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల కిందటి తన స్నేహితులను మరొకసారి కలుసుకునే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని అన్నారు. తమ తరగతికి చెందినవారు కొంతమంది మరణించగా వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు చీల వినోద్, చీల వెంకటేశ్వర్, రమేష్, అభయ్ కుమార్ ఆచార్య ముక్త విలాస్, వరముని మధు, శ్రీకాంత్, పోలంపల్లి రమేష్, పాల్వాయి సుధాకర్, సుజాత, సురేఖ పాల్గొన్నారు.

పశువులకు నిలయాలు ప్రభుత్వ పాఠశాలలు

నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వ పాఠశాలల్లోప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించక పోవడంతో ఉపాధ్యాయులు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలకు ప్రహరీ గోడ లేకపోవడంతో పాఠశాలలు పశువులకు పందులకు నిలయాలుగా మారుతున్నాయి. దాంతో విద్యార్థులు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 38 పాఠశాలలు ఉండగా 23 పాఠశాలకు 16 కాంపౌండ్ వాల్ లేదు. పాఠశాలలకు ప్రహరి గోడ లేకపోవడంతో రాత్రివేళల్లో పశువులు పందులు నివాసం ఏర్పరుచుకుంటున్నాయి. పశువులు పేడ వేయడం మూత్రం చేయడంతో పాఠశాలలు అపరిశుభంగా మారుతున్నాయి. ప్రభుత్వం పాఠశాలల్లో స్కవెంజర్లను తొలగించడంతో పారిశుధ్య పనులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో పారిశుధ్య పనులను తామే చేసుకోవాల్సి వస్తుందని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. పాఠశాలలకు కాంపౌండ్ వాల్ లేకపోవడంతో పారిశుధ్య పనుల సమస్య మరింత జటిలమైందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పశువులు పందులు వేసిన పేడ మూత్రం తొలగించడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అపరిశుభ్రమైన వాతావరణంలో విద్యాబోధన ఇబ్బందిగా మారిందన్నారు. అధికారులు నాయకులు పాఠశాలల కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.





దళితులపై దాడులకు నిరసనగా నేడు రాస్తారోకో



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ నేడు జిల్లా కేంద్రాల్లో రాస్తారోకో నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అగ్రకులాల వారు దళితులపై దాడులు చేస్తున్నారని అన్నారు. ఆయినప్పటికీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఒంగోలులో దళిత యువకున్ని చితక బాధడం, మణిపూర్ దళిత యువకుడిని కొట్టి రక్తం పారేలా చేయడం ఇలాంటివి జరిగినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. వీటన్నిటిని నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే నేడు చేపట్టే రాస్తారోకో విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేగుంట సాగర్, మహేష్, తోట రామచంద్ర, రేగుంట వెంకటేష్, బాలేష్, సురేష్, అశోక్, రాజయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని చెడ్వాయి గ్రామానికి చెందిన చింతపురి కృష్ణయ్య ఇంటిలో పీడీఎస్ బియ్యం నిల్వఉన్నట్టు అందిన సమాచారం మేరకు ఆదివారం ఎస్సై కొమురయ్య, టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో దాడులు చేయగా చింతపురి కృష్ణయ్య ఇంటిలో నిల్వఉన్న ఐదు క్వింటాళ్ల బియ్యం లభించినట్టు, ఆయనపై కేసు నమోదుచేసినట్టు తెలిపారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-నస్పూర్

బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ గనులలో, డిపార్‌మెంట్లలో బీఎంఎస్ జెండాను ఆవిష్కరించి, స్వీట్లను పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఏరియా కార్యదర్శి నాతాడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సెంట్రల్ సెక్రటరీ నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ జీడి ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాదాసీ భీమయ్య, పంచేర్పుల నరేష్, రామగిరి పురుషోత్తమా చారి, మిట్టపల్లి మొగిలి, బోడిగ చంద్రశేర్ పాల్గొన్నారు.

జైపూర్ : భారతీయ మజ్దూర్ సంఘ్ 68వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీపీపీ ప్రధాన ద్వారం ఎదటు బీఎంఎస్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్, అధ్యక్షులు చీనూరి రాజేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ పేరం రమేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బోడకుంట శ్రీధర్, తాగరి కృష్ణ, వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఎస్పీ కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-కాగజ్‌నగర్

బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎందుకు సీఎం కావాలని ముద్రించిన కరపత్రాలను ఆదివారం ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐపీఎస్ చదివి ఉన్నతపదవిలో ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరున్నరేళ్ల ముందే తన ఉద్యోగాన్ని వదిలివేసి రాజకీయాల్లోకి ప్రవేశించి బహుజనుల జీవితాల్లో వెలుగు నింపేందుకు కృషి చేస్తున్నాడని అన్నారు. ప్రవీణ్‌కుమార్‌ను సీఎం చేసేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అర్షద్‌హుస్సేన్, మాజీ జడ్పీ ఛైర్మన్ సిడం గణపతి, నాయకులు సోయం చిన్నయ్య, పిల్లల తిరుపతి, ముక్తార్, గౌతం పాల్గొన్నారు.